క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దూరు/కొత్తపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం తెల్లవారు జామునా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. లింగల్‌చేడ్ వాగునుంచి తిమ్మారెడ్డిపల్లికి చెందిన గొల్ల మహేష్ తన ట్రాక్టర్ రాత్రి వేళలో అక్రమంగా ఇసుకను అప్పిరెడ్డిపల్లికి తరలిస్తున్న క్రమంలో రాత్రి పెట్రోలింగ్ వెళ్లిన పోలీసులు భూనీడ్ వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ద్వితీయస్థానం



మక్తల్: రాష్ట్ర స్థాయి కంఠస్థ పోటీల్లో మక్తల్‌కు చెందిన హరికుమార్ ద్వితీయ స్థానం సాధించి ప్రశంసా పత్రం అందుకున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భీంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో అరోరా కళాశాల రామంతాపూర్‌లో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బీంరెడ్డి, సత్యనారాయణ, వాకిటి భీమన్న, మల్లికార్జున్, అక్షయ్, నాగరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక

కొత్తపల్లి: మండలంలోని యాదవ సంఘం మండల నూతన కమిటీని జిల్లా కమిటీ సభ్యులు రఘువీర్ యాదవ్ సమక్షంలో ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మల్లేష్ యాదవ్, గౌరవ కమిటీ అధ్యక్షుడిగా బాలప్ప, కో–శాధికారిగా గోపాల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన యాదవులు తిరుపతి, నర్సింహులు, కేశవులు, నాగులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కోస్గి రూరల్: కమిట్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కంటి వైద్యశిబిరం విజయవంతమైందని కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ ఈడీ జాన్సీరాణి అన్నారు. ఆదివారం మార్కెట్‌మార్డు ఆవరణలో కంచి కామకోటి మెడికల్ ట్రస్టు హైదరాబాద్ వారు చేపట్టిన వైద్యశిబిరంలో వందమందికి పరీక్షలు చేయగా 25మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నారాయణమ్మ, దేవమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పాఠశాలలో తీరిన దాహార్తి



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఎరగ్రుట్ట వద్ద ఉన్న కస్తుర్బాగాంధీ పాఠశాలలో గత కొన్నిరోజులుగా నీటి సమస్యతో విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన మిషన్ భగీరథ నీళ్లతోనే అన్ని అవసరాలు తీర్చుకుంటూ చదువులు సాగిస్తున్నారు. పాఠశాలలో 265మంది విద్యార్థినులు ఇబ్బందులకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి కొత్తగా బోరు వేయించడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మ్యాతరి నర్సింహులు ఇటీవల హైదరాబాద్‌లో ప్రమాద వశాత్తు మృతిచెందాడు. కాగా ఆదివారం మృతుడి కుటుంబానికి తోటి కార్మికులు తమ వంతుగా రూ. 21వేలు ఆర్థిక సాయం అందించి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సాయిరాం, లాలు, వెంకటయ్య, నర్సింహులు, బసప్ప, శ్రీను, కృష్ణ, బాబా, వెంకటప్ప, కాశప్ప, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటి సంఘాల ఎన్నికల ఊసేది?

- 2006లో చివరిసారిగా ఎన్నికల నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వం
- అధ్వానంగా మారుతున్న చెరువులు



మాగనూర్ గ్రామ పెద్ద చెరువు

మాగనూర్: 18ఏళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో చెరువులు అధ్వానంగా మారాయి. చెరువుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్ని శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం తదితర పర్యవేక్షణ పనులు నీటి సంఘాలు, పాలకవర్గాలు చేపట్టేవి. 18ఏళ్లుగా ప్రభుత్వాలు నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.

గతంలో ఇలా..

గతంలో ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్‌తోపాటు డైరెక్టర్ ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతోపాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ.. అభివృద్ధి పనులు నిర్వహించేవారు. ఏళ్లుగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది.

2008నుంచి ఎన్నికలు నిలిపివేత..

మండలంలో వంద ఎకరాలు అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు, కుంటలు దాదాపుగా 63 ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖాలు లేవు. ఇప్పటికైనా నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించి, చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

దృష్టిసారించాలి..



నీటి సంఘాలను ఎన్నుకుంటే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండడంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసింది. ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించాలి.

– పల్లె మారెప్ప, రైతు, మాగనూర్

ఏర్పాటు చేస్తాం..



ప్రస్తుతం మక్తల్ నియోజకవర్గంలో సంగంబండ బ్యాలెన్సింగ్ ప్రాజెక్టు నిర్మాణం సాగుతుంది. పనులు ఇంకా పూర్తిస్థాయిలో కాలేదు. అందు చేత నీటి సంఘాల ఏర్పాటు జరగడం లేదు. త్వరలోనే పనులు పూర్తయిన తర్వాత నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు నీటి సంఘాలను ఏర్పాటు చేస్తాం.

– ఆర్. భానుచందర్, ఇరిగేషన్, ఏఈఈ మాగనూర్

పండగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు కలిసిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దామరగిద్ద: పండగ సాయన్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ ప్రతీక అని మండల ముదిరాజ్ నాయకులు ఈదప్ప, గవినోళ్ల శ్రీనివాస్, సుభాష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ వన్నాడ ఆశమ్మ నివాసంలో మండల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో పండగ సాయన్న విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ఐక్యతను చాటే విధంగా పండగ సాయన్న విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటుకు సంకల్పించడం సంతోషనీయమన్నారు. అందరి సహకారంతో విగ్రహ ఏర్పాటు విజయవంతం చేద్దామన్నారు. మండలంలోని ముదిరాజ్‌లందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అంతకుముందు విగ్రహ ఆవిష్కరణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు, సుభాష్, తిప్పన్న, వన్నాడ చంద్రకాంత్, సత్యనారాయణ, బస్వరాజ్, భీము, బాలప్ప, శరణప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

దినేష్ సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

నారాయణపేట రూరల్: మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయ కమిటీ సభ్యులు దినేష్ లాహోటి చేసిన సామాజిక సేవలు చిరస్మరణీయమని భక్తులు కొనియాడారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని, ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంబాబు, ఆలయ పూజారి సోమశేఖర స్వామి, ఎల్ రాధాకృష్ణ, వేముల మధుసూదన్ రెడ్డి, ఎల్. అశోక్, ఆర్. భాస్కర్ రెడ్డి, ఆనంద్, చంద్రశేఖర్ గౌడ్, రమాకాంత్, రాంరెడ్డి, శ్రీనివాస్ లాహోటి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు



మరికల్: మండలంలోని పస్పులలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామంలోని దాతలు సహకరించాలని ఆలయ నిర్వాహకులు అన్నారు. ఆదివారం మహిళ సంఘాల సభ్యులు ఆలయ నిర్మాణానికి రూ. 29వేలను అందజేశారన్నారు. మరింత మంది దాతలు ముందుకు వస్తే నిర్మాణ పనులు పూర్తిచేసి ఆలయ ప్రారంభిస్తామన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశలకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

షెడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



భూమి పూజ చేస్తున్న నాగరాజ్‌గౌడ్ స్వామి

అమరచింత : మండలంలోని శ్రీఅడవి ఆంజనేయ ఆలయ సమీపంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నూతన రేకుల షెడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తమ సొంత స్థలాన్ని దానంగా ఇవ్వగా గోవిందు, మనెమ్మలు రేకుల షెడ్‌కు నిర్మాణానికి విరాళం అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం.నాగరాజ్‌గౌడ్ స్వామి భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో దర్గా గంధోత్సవం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రిలో గల హజ్రత్ సయ్యద్ షా జమాల్ హుస్సేని చిస్తీ, సయ్యద్ కమాల్ హుస్సేనీ చిస్తీ రొహెమతుల్లాఅలై దర్గా 649వ ఉర్సును ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్ ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా రామయ్యబౌళి, అశోక్‌టాకీస్ చౌరస్తా, తిమ్మసానిపల్లి గేట్, దొడ్డలోనిపల్లి మీదుగా దర్గాకు తీసుకెళ్లారు. దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు అందజేశారు. మతపెద్దలు మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ, ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్, ముస్లిం పెద్దలు అబ్దుల్‌జకీ, గౌస్ మొహియోద్దీన్, మహ్మద్ ఫయాజ్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అమరచింత: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. సృష్టిని నిర్మించిన ఆ పరమాత్ముని ప్రబోధనలు ప్రతి ఒక్కరూ విని భక్తి భావంతో ఉండాలన్నారు. ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మ జ్ఞానానికి గుర్తన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ, పెబ్బేరు కమిటీ, మద్దిగట్ల కమిటీ అధ్యక్షులు, సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి ,రాఘవేంద్ర, నరేందర్, పురుషోత్తం శ్రేష్టి, రామచంద్రయ్య, బాలకృష్ణ, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

మద్దూరు: పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంచర్ల గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని నెలల కింద రోడ్డు ఇరువైపులా విస్తరణ పనుల కోసం గుంతలను తీసి అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పనులు చేపట్టకపోతే వ్యాపారస్తులు, ప్రజలతో కలిసి ధర్నా చేపడుతామని పేర్కొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

కోస్గి రూరల్: కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని ఈ నెల 13న జిల్లాలో చేపట్టే సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9నుంచి ప్రారంభమయ్యే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ బిల్ ప్రవేశపెట్టాలని డిమాండ్‌చేశారు. జిల్లాలోని అంబేడ్కర్ భవనంలో జరిగే కార్యక్రమానికి పారిశుద్ధ్యకార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అయ్యప్ప మాలధారులకు ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: 18వసారి అయ్యప్ప మాల ధరించి శబరిమలైకు వెళ్తున్న గురుస్వాములను అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం అశోక్‌టాకీస్ చౌరస్తాలోని అమావాస్య అన్నదాన మండపంలో ఘనంగా సన్మానించారు. అయ్యప్ప మాలధారులకు శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన మండపం నుంచి పాదయాత్రంగా రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ మాట్లాడుతూ అన్నదాన మండపంలో ఏదైనా ఒక గొప్ప కార్యక్రమం చేయాలనే ఉద్దేశంతో 30మంది అయ్యప్ప మాలధారలను సన్మానించినట్లు తెలిపారు. సమితి సభ్యులు, గురుస్వాములు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్ఎస్ ఎస్ నాయకులు



పాల్గొన్న కార్యకర్తలు..

నారాయణపేట రూరల్: సమ సమాజ స్థాపన ఆర్ఎస్ఎస్ లక్ష్యమని విభాగ కార్యవహ రాము అన్నారు. ఆదివారం మండలంలోని శ్యాసన్‌పల్లిలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కార్యకర్తలు ఉత్సాహ భరితంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో రాము మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో హైందవ సంస్కృతిపై ముప్పేట దాడి జరుగుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా తిప్పికొట్టాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్, వీహెచ్పీ, ఏబీవీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం..

మరికల్: క్రీడలతో విద్యార్థులు ఒత్తిడిని అదిగమించొచ్చని ఎస్ఐ ఎం. రాము అన్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సీఎం కప్ గ్రామస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొంటే మానసిక, శారీరకంగా ఒత్తిడిని జయించవచ్చన్నారు. గ్రామస్థాయి క్రీడల్లో గెలుపొందిన జట్టు మండల స్థాయికి ఎంపిక చేస్తామని ఎంపీడీఓ కొండన్న తెలిపారు. ఎంపీడీఓ కొండన్న, హెచ్ఎం నాగరత్నమ్మ, ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, గోవర్ధన్, సత్యన్న, శివ, గోపాల్, రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, రఘు, మల్లేష్ పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రాము

ప్రభుత్వానికి అవార్డులు.. సర్పంచ్‌లకు అప్పులా

నారాయణపేట రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు అప్పులు తెచ్చి మరి పనులు చేయిస్తే అవార్డులను పొందిన ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదని తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి విమర్శించారు. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించడం, స్మశాన వాటిక లాంటి పనులకోసం అప్పులు తెచ్చి మరి పూర్తిచేస్తే దా దాపు రాష్ట్రంలో 70శాతం పంచాయతీలకు రూ.30నుంచి రూ.40 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాలని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా బిల్లులను ఆపేసి, అప్పులు మాత్రం సర్పంచ్‌లకు మిగిల్చారని విమర్శించారు. రాష్ట్రంలో కొందరు సర్పంచ్‌లు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఆత్మహత్యలకుపాల్పడిన సంఘటనలు కూడా చూస్తున్నామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచ్‌లకు బిల్లులు విడుదల చేస్తామని చెప్పి ఏడాది కావస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర శాఖ పిలుపుతో నిరసనలో భాగంగా చలో అసెంబ్లీకి జిల్లాలోని అన్ని మండలాల నుంచి తాజా మాజీ సర్పంచ్‌లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాదకరంగా మలుపు



చిన్నవాగు సమీపంలో రోడ్డు ఇలా..


మాగనూర్: మండలంలోని మాగనూర్– వర్కూర్ గ్రామాల మధ్య చిన్నవాగు సమీపంలో మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చేందుకు బీటీ రోడ్లను నిర్మిస్తుంది. కానీ రోడ్లపై మలుపులు ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదు. మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపు వద్ద సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉచిత కంటి ఆపరేషన్‌కు తరలింపు

దామరగిద్ద: మండల కేంద్రంలోని రేయిన్‌బో పాఠశాలలో ఆదివారం సక్షమ్ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సక్షమ్ స్వచ్ఛంద నిర్వాహకులు జిల్లా కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ సమక్షంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. మొత్తం 112మందికి పరీక్షలు నిర్వహించగా 45మందికి కంటి ఆరేషన్ అవసరమైనట్లు వైద్యులు గుర్తించారు. కాగా వీరిని ప్రత్యేక వాహనంలో ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. మండల కార్యదర్శి సురేష్, సతీష్ పాల్గొన్నారు.

మారేమ్మయాడి.. హుదో.. హుదో

- భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన మరేమ్మ ఉత్సవాలు



మారేమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

అమరచింత: హుదో.. హుదో మారెమ్మ యాడీ హుదో హుదో అంటూ తండాల్లో మరెమ్మ దేవత నామస్మరణ మార్మోగింది. ఆదివారం మండలంలోని చంద్రనాయక్ తండా, తూక్యనాయక్ తండా, దీప్లానాయక్ తండా, కొత్త తండాల్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. లంబాడీలు సంప్రదాయ వస్త్రాలు అలంకరించుకుని ఆలయం వద్ద నృత్యాలు ప్రదర్శిస్తు, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇంటింటికి బోనంతో పాటు పొట్టేళ్ల, కోడిపుంజులు అమ్మవారికి బలిచ్చి తమ కష్టాలను దూరం చేసి సుఖశాంతులతో ఉండేలా దీవించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుమారుడు అచ్యుతరామ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కర్నూల్ పట్టణంలో ఆదివారం జరిగిన సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. 12 ఏళ్ల కటాస్ విభాగంలో హారిక, 14 ఏళ్ల విభాగంలో సాయిచరణ్ ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు, ఆయా విభాగాల్లో వరుణ్‌కుమార్, కిరిటీ రజత పతకాలు పొందారు. విద్యార్థులను మాస్టర్ వెంకటేశ్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు.

కరాటేలో ప్రతిభ

హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు 7బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను హజ్రత్ మౌలానా ఆలే మహ్మద్ షబ్బర్‌పాష ఖాద్రీ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్‌అలీ, మహ్మద్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్‌ఖాన్ అభినందించారు. సీనియర్ కరాటే మాస్టర్ తాజుద్దీన్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు